VC NEWS
# వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...
TELUGU DAILY NEWS
www.veguchukkanews.com
బుధవారం 01 మే 2024
సంపుటి.01 సంచిక.278




# రాష్ట్రంలో ఆర్ఆర్ ట్యాక్స్

## తెలంగాణలో భాజపా చరిత్ర సృష్టిస్తుంది



లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో భాజపా చరిత్ర సృష్టిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. విశాల్‌జనసభలో ఆయన మాట్లాడుతూ.. 17 స్థానాల్లో కాషాయ జెండా ఎగురవేయడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఏ వాడకెళ్లినా, ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు మోదీకే ఓటేస్తామంటున్నారని పేర్కొన్నారు. మోదీ ప్రధాని కావాలని, భాజపాకు ఓటేస్తామని గ్రామాల్లో తీర్మానాలు చేస్తున్నారన్నారు. రైతులు, యువత, మహిళలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి గ్రామాల్లో తీర్మానాలు చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో భాజపా బలపడుతుంటే కాంగ్రెస్, భారాసల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయన్నారు. అందువల్లే ఆ పార్టీల నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. భారాసకు చెందిన ఓ నాయకుడు హైదరాబాద్ యూటీ అవుతుందని, మరో నేత కేంద్రంలో హంగ్ వస్తుందని, కాంగ్రెస్‌కు చెందిన ఓ నేత రిజర్వేషన్లు ఎత్తేస్తారని.. తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ కిషన్‌రెడ్డి దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీ అవలంబిస్తున్న విధానాల వల్లే బీసీలకు అన్యాయం జరుగుతోందన్నారు. ముస్లిం రిజర్వేషన్ల కారణంగా బీసీలకు వచ్చే రిజర్వేషన్లలో కోత పడుతోందన్నారు. జీహెచ్‌ఎంసీలో 150 స్థానాలుంటే 31కి పైగా స్థానాల్లో ముస్లింలు (నాన్ బీసీ)లు గెలిచారన్నారు. ఈ పరిస్థితిని గమనిస్తే భారాస, కాంగ్రెస్‌లు తోడుదొంగలని అర్థమవుతోం దని ఆరోపించారు. ఆ రెండు పార్టీలు ఒకే నాణానికి బొమ్మ, బొరుసులాంటివని, భాజపా ప్రభంజనాన్ని అడ్డుకునేందుకు ఒక్కటవుతు న్నాయని ఆరోపించారు.

## 'ఫేక్ వీడియో ఉదంతంలో డబుల్ ఆర్ పేరు'

"దేశంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య భావనను తుత్తునియలు చేస్తోంది. ఫేక్ వీడియోలతో ప్రజలను తప్పుదోవ పట్టించి, ఘర్షణ వాతావరణం సృష్టిస్తోంది. ఇప్పుడు ఈ ఉదంతంలో డబుల్ ఆర్ పేరు వినిపిస్తోంది. ఇలాంటి ప్రయత్నాలు దేశప్రజలు ఎవరైనా చేస్తారా? అత్యుత్తమమైన రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తి ఇలా చేయొచ్చా?"

ప్రధాని మోదీ

తెలంగాణలో వసూలు.. దిల్లీకి పెద్ద వాటా!

కాంగ్రెస్, భారాస.. రెండూ అవినీతి రాకెట్‌లో సభ్యులే

రాజ్యాంగాన్ని ఆది నుంచీ అవమానించింది కాంగ్రెస్సే

అందుకే అసలు ప్రతిని తొలుతే దాచేశారు



2లో

## కాంగ్రెస్ గుర్తు పంజా..

"కాంగ్రెస్ చేతి గుర్తు పంజా. అబద్ధాల నినాదాలు.. అసత్యపు హామీలు, ఓటుబ్యాంకు రాజకీయాలు, మాఫియా-నేరగాళ్లకు కొమ్ము కాయడం, కుటుంబవాదం, అవినీతి.. ఇవన్నీ కలిపి ఆ పంజా ఏర్పడుతుంది. దీని గురించి తెలంగాణ ప్రజలు ఇప్పుడిప్పుడే తెలుసుకుంటున్నారు. అర్థం చేసుకుంటున్నారు."

ప్రధాని నరేంద్ర మోదీ





## రాష్ట్రంపై నిప్పులు కక్కుతున్న భానుడు

### ఎండలకు తోడు ఉక్కపోతలు

**హైదరాబాద్:** రాష్ట్రం నిప్పుల కొలిమిని తలపిస్తున్నది. భానుడు నిప్పులు కక్కుతున్నాడు. మండే ఎండలకు తోడు ఉక్కపోతకు ప్రజలు ఉకిరిబికిరి అవుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సాధారణం కన్నా దాదాపు ఐదు డిగ్రీలపైన ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. కొద్ది రోజులుగా ప్రమాద హెచ్చరిక స్థాయి 45 డిగ్రీల మారును దాటి ఎండలు మండుతున్నాయి. ఏడు జిల్లాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నల్లగొండ జిల్లా మాడుగులపల్లి మండలంలో రాష్ట్రంలోనే అత్యధికంగా 45.4 డిగ్రీలు నమోదైనట్టు వాతావరణశాఖ అధికారులు తెలిపారు. ఈ జిల్లాలోని మాటూరు, తిమ్మాపురంలో 45.1 డిగ్రీలు, నిడమనూరు, కామారెడ్డిగూడెంలో 44.8, భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా అశ్వాపురంలో 45.3 , ములుగు జిల్లా మంగపేటలో 45.3, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కొత్తపల్లేగోరి మండలం రాగొంలో 45.2, ఖమ్మం జిల్లా చింతకానిలో 45.1, వనపర్తి జిల్లా పాన్గల్‌లో 45.1, జగిత్యాల జిల్లా వెల్గటూరులో 45 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ జిల్లాలకు వాతావరణశాఖ రెడ్ అలర్ట్‌ను జారీ చేసిం ది. మహబూబాబాద్, నిజామాబాద్ సహా పలు జిల్లాల్లో 44.9 డిగ్రీల ఎండ తీవ్రత కొనసాగింది. ఖమ్మం, ములుగు జిల్లాల్లో వడగాలులు వీచినట్టు అధికారులు తెలిపారు. మంగళవారం కూడా ఉష్ణోగ్రతల తీవ్రత కొనసాగుతుందని హెచ్చరించింది. కొన్ని జిల్లాల్లో ఈదురు గాలులతో మోస్తరు వర్షాలు కురుస్తాయని ఐఎండీ వెల్లడించింది.దేశంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు తెలంగాణలో నమోదవుతున్నాయి. సోమవారం ఏడు జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో 45 డిగ్రీలు, మరో 26 జిల్లాల్లో 40 డిగ్రీలకుపైగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నిరుడు ఏప్రిల్‌తో పోలిస్తే 4.5 డిగ్రీలు అధిక ఉష్ణోగ్రతలు నమోదైనట్టు వాతావరణ శాఖ తెలిపింది. గత ఏప్రిల్ 29న రాష్ట్ర సగటు అత్యధిక ఉష్ణోగ్రత 40.9 డిగ్రీలుగా రికార్డయింది.

## విజయవాడ రూట్లో మరిన్ని బస్సులు: ఆర్టీసీ



**హైదరాబాద్:** ప్రయాణికులకు టిఎస్ ఆర్టీసి మరో శుభవార్త చెప్పింది. ఈ మేరకు హైదరాబాద్- టు విజయవాడ రూట్‌లో ప్రయాణించే వారి కోసం ప్రతి 10 నిమిషాలకు ఒక బస్సును అందుబాటులో తీసుకొచ్చినట్లుగా టిఎస్ ఆర్టీసి వెల్లడించింది. ప్రయాణికులు ఇబ్బంది పడకుండా హైదరాబాద్- టు విజయవాడ మార్గంలో ప్రతిరోజు 120కి పైగా బస్సులను సంస్థ నడుపుతోంది. అదేవిధంగా బస్సుల్లో ముందస్తుగా రిజర్వేషన్ చేసుకునే వారికి 10 శాతం డిస్కౌంట్‌ను సంస్థ కల్పించింది.ఆ రాయితీ రిటర్న్ జర్నీకి కూడా వర్తిస్తుందని ఆర్టీసి అధికారులు తెలిపారు. టిఎస్ ఆర్టీసి బస్సుల్లో అడ్వాన్స్ రిజర్వేషన్ కోసం అధికారిక వెబ్‌సైట్ ను సంప్రదించాలని ఆర్టీసి ఎండి సజ్జనార్ ట్విట్టర్‌లో పోస్ట్ షేర్ చేశారు. అందులో లహరి ఏసి స్లీపర్ 2, నాన్ ఏసి స్లీపర్ కమ్ సీటర్ 2, గరుడ 10, గరుడ ప్లస్ 9, రాజధాని 41, సూపర్ లగ్జరీ 62 బస్సులు ఉన్నాయి.

## అమిత్ షాను ఆవరించిన కెసిఆర్ ఆత్మ

అమిత్ షాను ఆవరించిన కెసిఆర్ ఆత్మ

అందుకే ఢిల్లీ పోలీసులను పంపారు

తెలంగాణకు పట్టిన చీడ కెసిఆర్

దేశంలో జరగబోయేవి ఫైనల్స్

ఇందులో కాంగ్రెస్‌ను గెలిపించాలి

బిఆర్ఎస్, బిజెపిల మధ్య అవగాహన ఉంది

పరకాల జనజాతర సభలో రేవంత్ రెడ్డి

2లో





## కేజ్రీవాల్ అరెస్ట్‌పై సుప్రీం విచారణ

శుక్రవారం లోగా సమాధానం చెప్పాలి ఇడిని ఆదేశించిన న్యాయస్థానం

2లో



## తెలంగాణ టెన్త్ ఫలితాలు

### నిర్మల్ ఫస్ట్.. వికారాబాద్ లాస్ట్

హైదరాబాద్: తెలంగాణ పదో తరగతి ఫలితాల ను విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం విడుదల చేశారు. ఫలితాల్లో 91.31 శాతం ఉత్తీర్ణత నమోదైంది. మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు పరీక్షలు నిర్వహించారు. మొత్తం 5,05,813 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఫలితాల్లో బాలికలు పైచేయి సాధించారు. 93.23 శాతం బాలికలు, 89.42 శాతం బాలురు పాసయ్యారు. 99.05 శాతంతో నిర్మల్ జిల్లా మొదటి స్థానంలో..65.10 శాతంతో వికారాబాద్ చివరి స్థానంలో నిలిచాయి. రాష్ట్రంలో 3,927 పాఠశాలలు శతశాతం ఉత్తీర్ణత సాధించినట్లు బుర్రా వెంకటేశం తెలిపారు. 8,883 మంది విద్యార్థులు 10/10 జీపీఏ సాధించినట్లు చెప్పారు.



కాంగ్రెస్ దిగజారుడు రాజకీయాలకు పరాకాష్ట

2లో



కోవిడ్ వ్యాక్సిన్‌పై మరో దుమారం

2లో



స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు

2లో

# రాష్ట్రంలో ఆర్ఆర్ ట్యాక్స్



హైదరాబాద్:తెలంగాణలో ఆర్ఆర్ ట్యాక్స్ పేరిట అక్రమ వసూళ్లు చేసి, ఢిల్లీకి పెద్ద వాటాను నల్లధనం రూపంలో తరలిస్తున్నారని ప్రధాని నరేంద్రమోదీ ఆరోపించారు. ఈ ట్యాక్స్ వచ్చే ఐదేళ్లలో తెలంగాణను పూర్తిగా ధ్వంసం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్, భారాస పార్టీలు ఒక్కటేనని, అవినీతి రాకెట్ సభ్యులని విమర్శించారు. మెదక్ జిల్లా అల్లాదుర్గంలో మంగళవారం భాజపా నిర్వహించిన విశాల్ జనసభలో ప్రధాని మోదీ ప్రసంగిస్తూ.. కాంగ్రెస్, భారాసలపై నిప్పులు చెరిగారు. 'తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే రైతులకు వంద రోజుల్లో రుణమాఫీ చేస్తామని, వరికి క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పింది. ఇప్పటి వరకు అవి అమలు కాలేదు. వాటి గురించి సమాధానం చెప్పకుండా కాంగ్రెస్ నాయకులు నోళ్లకు తాళాలు వేసుకున్నారు' అని దుయ్యబట్టారు. దేశంలో రాజ్యాంగం పుట్టుక కాంగ్రెస్‌కి ఇష్టం లేదని, అందుకే నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్, రాహుల్‌గాంధీ రాజ్యాంగాన్ని అడుగడుగునా అవమానించారని తెలిపారు. ఎన్డీయే మూడో దఫా పరిపాలనలో రాజ్యాంగం ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని, గల్లీగల్లీలో కాంగ్రెస్ పాపాల్ని అందరికీ వెల్లడిస్తామని పేర్కొన్నారు. రాజ్యాంగం ద్వారా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు కల్పించిన రిజర్వేషన్లను.. తాను బతికున్నంత వరకు ముస్లింలకు ఇవ్వనివ్వబోనని ప్రధాని స్పష్టం చేశారు.

**ట్రిపుల్ ఆర్‌తో ఖ్యాతి.. డబుల్ ఆర్‌తో అప్రతిష్ఠ**

తెలుగు సినీ పరిశ్రమ దేశానికి 'ట్రిపుల్ ఆర్' ఇచ్చింది. తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఆర్ఆర్ ట్యాక్స్‌ను ఇచ్చింది. ఆ సినిమా దేశ ప్రతిష్ఠను పెంచితే.. ఈ ట్యాక్స్ దేశం సిగ్గుపడేలా చేస్తోంది. తెలంగాణలో అన్ని వైపులా ఈ చర్చ నడుస్తోంది. గుత్తేదారులు, ఇతరులు ఆర్ఆర్ ట్యాక్స్‌ను వెనక దర్వాజా నుంచి ఇస్తున్నారు. ఈ ట్యాక్స్‌లో పెద్ద వాటా ఢిల్లీకి వెళ్తోంది. ఈ ఆర్ఆర్ ఎవరో అందరూ అర్థం చేసుకుని ఉంటారు. దీన్ని ప్రజలు అడ్డుకోవాలి. మొన్నటి వరకు రాష్ట్రాన్ని భారాస ధ్వంసం చేయగా.. ఇప్పుడు ఆర్ఆర్ ట్యాక్స్ మరింత నష్టం చేస్తోంది. ఈ పన్నును అడ్డుకునేందుకు తెలంగాణ నుంచి భాజపా అభ్యర్థులందరినీ గెలిపించి ఢిల్లీ పంపించాలి. అప్పుడే అవినీతిపరులు భయపడతారు.

**అవినీతిని పరస్పరం సమర్థించుకుంటున్నారు..**

రాష్ట్రంలో భారాస, కాంగ్రెస్ రెండూ ఒక్కటే. భారాస.. కాళేశ్వరం ప్రాజెక్టు కుంభకోణానికి పాల్పడినప్పుడు కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉంది. సర్కారు ఏర్పాటైన తరువాత విచారణ చేస్తామని చెప్పి కాళేశ్వరం దస్త్రాన్ని తొక్కిపెట్టింది. భారాస సర్కారు ఉన్నప్పుడు ఓటుకు నోటు కేసును ముందుకు వెళ్లనీయలేదు. కాంగ్రెస్, భారాస రెండూ అవినీతి రాకెట్ సభ్యులే. ఢిల్లీ లిక్కర్ స్కాంలో భారాస వాళ్లు ఉన్నారు. ఢిల్లీలో ఉన్నవారు కాంగ్రెస్‌తో కలిసి కూటమిలో ఉన్నారు. స్కాం విచారణ ప్రారంభం కాగానే రాకెట్ సభ్యులు ఒకరిని ఒకరు సమర్థించుకుంటున్నారు.

మహిళలను కాంగ్రెస్ ఓటుబ్యాంకుగా చూస్తోంది.

గతంలో ప్రపంచం ముందుకు వెళ్తుంటే.. భారత్‌లో కాంగ్రెస్ అవినీతి అన్ని రంగాల్లోకి పాకింది. ఈ సంక్లిష్ట పరిస్థితి నుంచి దేశాన్ని ఎన్డీయే చాలా కష్టంగా బయటకు తీసుకువచ్చింది. కానీ కాంగ్రెస్ మరోసారి దేశాన్ని పాత దుర్దినాల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తోంది. ఆ పార్టీ హయాంలో మహిళలకు అన్నీ కష్టాలే. ఆడపిల్ల పుట్టిన తరువాత చదువుకోవడం కష్టమైన పనిగా ఉండేది. పాఠశాలల్లో మరుగుదొడ్లు లేకపోవడంతో చదువు మధ్యలోనే మానేసేవారు. బేటీ బచావో.. బేటీ పఢావో పథకం తెచ్చి బడుల్లో బాలికలకు టాయిలెట్లు నిర్మించాం. ఇప్పుడు వారు చదువులో ముందుకు వెళ్తున్నారు. పీఎంఏవై కింద నిర్మిస్తున్న ఇళ్లు మహిళల పేరిట ఇస్తున్నాం. కాంగ్రెస్ మహిళలను కేవలం ఓటుబ్యాంకుగా మాత్రమే చూస్తోంది.

**ఇక్కడ శోభాయాత్రలకు సర్కారు ఆటంకాలు**

ప్రభుత్వం బలంగా, నిర్ణయాత్మకంగా మారితే దేశభక్తితో పనిచేస్తుంది. అయోధ్యలో భవ్యరామమందిరం దీనికి ఉదాహరణ. ఇది 500 ఏళ్ల కల. ఈ దేవాలయాన్ని.. స్వాతంత్రం వచ్చిన వెంటనే నిర్మించాల్సింది. కానీ దిల్లీలో బలమైన సర్కారు ఏర్పాటయ్యాకే అది సాకారమైంది. రామమందిరాన్ని మోదీ నిర్మించలేదు.. మీ ఓటు ఇచ్చిన సంపూర్ణమైన శక్తితో ఆలయ నిర్మాణం పూర్తయింది. కాంగ్రెస్ తనకు ఓటు బ్యాంకు కానివారి కోసం ఏమీ చేయదు. తెలంగాణలోనూ మనకు అడ్డంకులు సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం.. తన ఓటు బ్యాంకు నిరాశకు గురికావద్దన్న దురుద్దేశంతో రామనవమి సందర్భంగా హైదరాబాద్‌లో శోభాయాత్రలకు అవరోధాలు, అడ్డంకులు సృష్టించింది.

**ఓటుబ్యాంకు రాజకీయాల ప్రయోగశాలగా ఉమ్మడి ఏపీ..**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్.. 2004, 2009లలో కాంగ్రెస్‌కు రికార్డు సంఖ్యలో ఎంపీ, ఎమ్మెల్యేలను ఇచ్చింది. అయినా ఆ పార్టీ ఇక్కడ ఎస్సీ, ఎస్టీ, బీసీ కులగణన చేపట్టకుండా వారి రిజర్వేషన్లను అడ్డుకుంది. ఉమ్మడి ఏపీని ఓటుబ్యాంకు రాజకీయాలకు ప్రయోగశాలగా మార్చింది. బీసీ రిజర్వేషన్లు తీసుకుని ముస్లింలకు ఇచ్చింది. తెలంగాణలో లింగాయత్‌లు, మరాఠా సమాజంలోని 24 కులాలను ఓబీసీల్లో కలపడం కాంగ్రెస్‌కు ఇష్టం లేదు. కానీ ముస్లింలను మాత్రం రాత్రికి రాత్రి బీసీలుగా గుర్తిస్తారు. బంజారాల ఆకాంక్షలపై భారాస, కాంగ్రెస్ నీళ్లు పోశాయి. రిజర్వేషన్లపై అబద్ధాలు చెప్పే కాంగ్రెస్ వారికి మాదిగ సమాజంపై ఆక్రోశం ఎందుకు? వారి కోసం మీరు ఏం చేశారు? కానీ నేను ఎస్సీ వర్గీకరణ హక్కు కోసం పోరాటం చేస్తానని మాటిచ్చా.

**రాజ్యాంగం పుట్టుక నుంచీ కాంగ్రెస్‌కు ద్వేషమే**

బాబాసాహెబ్ అంబేడ్కర్ ఇచ్చిన రాజ్యాంగప్రతిని చూస్తే, దానిపై ప్రతి కాగితంలో రామాయణం, మహాభారతం చిత్రాలు, మన సంస్కృతి, సంప్రదాయాలన్నీ ప్రతిబింబించేలా ఉంటాయి. భారత మహోన్నతమైన సంస్కృతిని, సంప్రదాయాలను రాజ్యాంగంతో జోడించే అద్భుతమైన ప్రయత్నం జరిగింది. కానీ కాంగ్రెస్ మాత్రం రాజ్యాంగ మొదటిప్రతిని బీరువాలో దాచేసింది. రాజ్యాంగాన్ని అగౌరవపరుస్తూ.. దేశ సంస్కృతి, సంప్రదాయాల అనుసంధానాన్ని తొలగించింది. ఎక్కడి నుంచి రాజ్యాంగం ముందుకు వెళ్లాలో దాన్ని తొలగించి, తొలిరోజునే రాజ్యాంగాన్ని ద్వేషించడం మొదలుపెట్టింది. యువరాజు ముత్తాత.. దేశ తొలిప్రధాని రాజ్యాంగం పట్ల అలా తొలిపాపం చేశారు. తరువాత యువరాజు నాయనమ్మ రాజ్యాంగాన్ని ముక్కలు చేసి దేశంలో ఎమర్జెన్సీ విధించారు. ఇక మూడో పాపం.. యువరాజు తండ్రి ప్రధానిగా ఉన్నపుడు జరిగింది. దేశ మీడియా, పత్రికలను భయపెట్టే భయంకరమైన చట్టాన్ని ఆయన తీసుకువచ్చారు. దీనిపై మీడియా, ప్రతిపక్షాలు, భాజపా ఆందోళన చేపట్టడంతో వెనక్కు తగ్గారు. మంత్రిమండలికి రాజ్యాంగం రక్షణ కల్పిస్తుంది. మన్మోహన్‌సింగ్ మంత్రివర్గం ఒక నిర్ణయం తీసుకుంటే.. ఈ యువరాజు పత్రికా సమావేశంలో ఆ నిర్ణయాన్ని అందరిముందు చింపేశారు. ఇలాంటి వ్యక్తులా రాజ్యాంగం గురించి మాట్లాడేది? తమ పార్టీ రాజ్యాంగాన్నీ కాంగ్రెస్ చెత్తడబ్బాలో పడేసింది. పార్టీ అధ్యక్షుడిగా ఉన్న సీతారాం కేసరిని రాత్రికి రాత్రి బాత్‌రూంలో బంధించి, ఫుట్‌పాత్‌పై పడేసి కాంగ్రెస్‌ను రాచకుటుంబం కబ్జా చేసింది.

**మతప్రాతిపదికన రిజర్వేషన్లకు కుట్ర..**

మతం ఆధారంగా రిజర్వేషన్లు ఇవ్వకూడదని అంబేడ్కర్ చేసిన ప్రతిపాదనపై రాజ్యాంగసభ నిర్ణయం తీసుకుని రాజ్యాంగంలో పొందుపరిచింది. రిజర్వేషన్లు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు ఉండాలని నిర్దేశించింది. కానీ యువరాజు, ఆయన అనుయాయులు.. రాజ్యాంగాన్ని మార్చాలనుకుంటున్నారు. తమ ఓటుబ్యాంకును బలోపేతం చేసుకునేందుకు దళితులు, ఆదివాసీలు, ఓబీసీల హక్కులు లాక్కుని మతం ఆధారిత రిజర్వేషన్లు ఇచ్చేందుకు ఆటలాడుతున్నారు. మోదీకి, మా ప్రభుత్వానికి రాజ్యాంగమే ధర్మగ్రంథం. రాజ్యాంగం అమల్లోకి వచ్చి 60 ఏళ్లు అయినపుడు దేశంలో గుజరాత్ సీఎంగా నేనొక్కడినే ఉత్సవం చేశాను. గుజరాత్ సురేంద్రనగర్‌లో ఏనుగుపై రాజ్యాంగాన్ని ఊరేగించి పెద్ద ప్రదర్శన నిర్వహించాను. రాజ్యాంగానికి ప్రతిబింబమైన పార్లమెంటులోకి 2014లో అడుగుపెట్టే ముందు.. తలవంచి నమస్కారం చేశాను. ఇదీ మోదీకి రాజ్యాంగం పట్ల ఉన్న గౌరవం.

**కేంద్ర ప్రభుత్వ పనులకు రాష్ట్ర సర్కారు అడ్డంకులు**

భాజపా సర్కారు తెలంగాణ అభివృద్ధికి రూ. లక్షల కోట్లు ఇచ్చింది. నాలుగు వందేభారత్ రైళ్లు నడుస్తున్నాయి. జహీరాబాద్ సహా 40 రైల్వే స్టేషన్లను అమృత్ కింద అభివృద్ధి చేస్తున్నాం. ఎల్లారెడ్డి – బోధన్ – భైంసా, సంగారెడ్డి – నాందేడ్ – అకోలా జాతీయ రహదారులు పూర్తయ్యాయి. అందోలు– నారాయణఖేడ్ – జుక్కల్ అనుసంధానత మరింత మెరుగవుతుంది. కానీ ఇక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ పనులను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తోంది. సమ్మక్క, సారక్క గిరిజన వర్సిటీకి భూమి ఇవ్వలేదు. మనోహరాబాద్, సిద్దిపేట, సిరిసిల్ల, కొత్తపల్లి రైల్వేలైను పనుల్ని సర్కారు నిలిపివేసింది. రాజకీయాల కోసం తెలంగాణ అభివృద్ధిని కాంగ్రెస్ అడ్డుకుంటోంది. అందుకే ఆ పార్టీ నుంచి పార్లమెంటుకు ఒక్కరిని కూడా గెలిపించకూడదు' అని పిలుపునిచ్చారు. ఈ సభలో ఎంపీ కె.లక్ష్మణ్, కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి, జహీరాబాద్, మెదక్ లోక్‌సభ అభ్యర్థులు బీబీ పాటిల్, రఘునందన్‌రావు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ వస్తే వారసత్వ పన్ను**

ప్రజలను దోచుకునేందుకు కాంగ్రెస్ పార్టీ వారసత్వపన్ను తీసుకువస్తుంది. జీవితాంతం కష్టపడి సంపాదించి, దాచుకున్న సంపదను.. చనిపోయిన తరువాత వారసులకు ఇవ్వరు. సగానికి కన్నా ఎక్కువ అంటే 55 శాతం వసూలు చేయాలని కాంగ్రెస్ పార్టీ యోచిస్తోంది.

## కాంగ్రెస్ దిగజారుడు రాజకీయాలకు పరాకాష్ఠ

**రాజకీయ లబ్ది కోసం దుష్ప్రచారలకు తెగింపు**

**ఫేక్ వీడియోపై తీవ్రంగా స్పందించిన అమిత్ షా**

**రిజర్వేషన్ల బలోపేతం బిజెపికే సాధ్యం అని వెల్లడి**

**మతపరమైన రిజర్వేషన్లను అంగీకరించబోమని స్పష్టీకరణ**

**న్యూఢిల్లీ:** రిజర్వేషన్ల రద్దుపై కాంగ్రెస్ రాజకీయ లబ్ది కోసం దుష్ప్రచారలకు తెగించిందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా మండిపడ్డారు. దిగజారుడు రాజకీయాలకు ఇది పరాకాష్టగా చెప్పుకొచ్చారు. అమిత్ షా చెప్పినట్లు ఉన్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన సంగతి తెలిసిందే. తాజాగా అమిత్ షా దీనిపై స్పందిస్తూ.. కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు చేశారు. ఆ పార్టీ అసహనంతోనే ఫేక్ వీడియోలు తయారు చేస్తోందని మండిపడ్డారు. తమ మాటలు వక్రీకరించి దుష్ప్రచారం చేస్తోందని దుయ్యబట్టారు. అయితే మతం ఆధారంగా రిజర్వేషన్లు ఇచ్చేందుకు భాజపా వ్యతిరేకమని మరోసారి స్పష్టం చేశారు. '400 సీట్లు దక్కించుకున్న తర్వాత భాజపా రిజర్వేషన్లను రద్దుచేస్తుందంటూ కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోంది. ఆ మాటలన్నీ నిరాధారమైనవి. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లకు మా పార్టీ మద్దతు ఎప్పుడూ ఉంటుందని స్పష్టం చేసారు. నాతోపాటు మా పార్టీకి చెందిన ఇతర నేతల నకిలీ వీడియోలను ప్రచారం చేసే స్థాయికి వారి అసహనం పెరిగిపోయింది. ముఖ్యమంత్రులు, ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, ఇతరులు ఈ ఫేక్ వీడియోను వ్యాప్తి చేశారు. ప్రస్తుతం ఆ పార్టీకి చెందిన ఒక ప్రముఖనేత క్రిమినల్ నేరాన్ని ఎదుర్కొంటున్నారు. ఇవన్నీ వారి అసంతృప్తిని వెల్లడి చేస్తున్నాయి. రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీ బాధ్యతలు తీసుకున్న నాటి నుంచి రాజకీయాలను మరింత దిగజార్చేపనిలో ఉన్నారు. ఈ తరహా దృశ్యాలను ప్రచారం చేసి, ప్రజల మద్దతు కూడగట్టుకునే ప్రయత్నం చేయడం ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదు. ఏ ప్రధాన పార్టీ కూడా ఇలాంటి చర్యలకు పాల్పడకూడదు' అని అమిత్ షా అన్నారు. తప్పుడు ప్రచారంతో కాంగ్రెస్ ప్రజల్లో అయోమయం సృష్టించే ప్రయత్నం చేస్తోందన్నారు. ఫేక్ వీడియోలతో కావాలనే తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు. ఎప్పుడైనా..ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లు రక్షించేది బీజేపీ అన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లకు మద్దతిచ్చేది కూడా బీజేపీనే అని చెప్పారు. ఇదే విషయాన్ని తాను గతంలో ప్రధాని నరేంద్ర మోదీకి కూడా చెప్పినట్లుగా అమిత్ షా గుర్తుచేశారు. గౌహతిలో విలేకరుల సమావేశంలో అమిత్ షా ఈ కామెంట్స్ చేశారు. 2023లో హోంశాఖ మంత్రి అమిత్ షా మాట్లాడిన వీడియోను ఎడిట్ చేసిన వీడియో సోషల్ మీడియాలో షేర్ చేయగా అది వైరల్ గా మారింది. అందులో అమిత్ షా.. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లను రద్దు చేస్తామని మాట్లాడినట్లుగా ఉంది. దీంతో రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో 400 సీట్లు దాటితే రిజర్వేషన్లను రద్దు చేసేందుకు బీజేపీ సిద్ధమవుతోందంటూ పలువురు కాంగ్రెస్ నాయకులు కామెంట్స్ చేస్తున్నారు. ఈ ఫేక్ వీడియోను కేంద్ర హోంశాఖ సీరియస్ గా తీసుకుంది. హైదరాబాద్ తో పాటుగా పలు ప్రాంతాల్లో కేసులు నమోదయ్యాయి. కర్ణాటకలో తమ మిత్రపక్షం జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణకు సంబంధించినవిగా చెప్తున్న అభ్యంతరకర వీడియోలపై స్పందించారు. 'దేశంలో మేం మాతృ శక్తికి అండగా నిలుస్తామన్నది స్పష్టం. అక్కడ అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఇంతవరకు ఎందుకు చర్యలు తీసుకోలేదు. అది ఆ రాష్ట్ర శాంతిభద్రతల అంశం. మేం విచారణకు అనుకూలంగా ఉన్నాం. ఆ ఘటనపై చర్యలు తీసుకుంటామని జేడీఎస్ కూడా ఇప్పటికే ప్రకటించింది' అని తెలిపారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని నియోజకవర్గాలైన అమేథీ, రాయబరేలీలో రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ పోటీ గురించి అడగ్గా..'వారు బరిలో ఉంటారా? లేదా? అనేది తెలీదు.

## కేజ్రీవాల్ అరెస్ట్‌పై సుప్రీం విచారణ

**శుక్రవారం లోగా సమాధానం చెప్పాలి ఇడిని ఆదేశించిన న్యాయస్థానం**



**న్యూఢిల్లీ:** ఎక్సైజ్ పాలసీ కేసుకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో తన అరెస్టును వ్యతిరేకిస్తూ ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ వేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో మంగళవారంనాడు విచారణ జరిగింది. కేజీవ్రాల్‌ను అరెస్టు చేసిన సమయంపై స్పందించాల్సిందిగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ ని అత్యున్నత న్యాయస్థానం ప్రశ్నించింది. 'వ్యక్తి స్వేచ్ఛ అనేది చాలా ముఖ్యం' అని కోర్టు ఈ సందర్భంగా అభిప్రాయపడింది.లోక్‌సభ ఎన్నికలకు కొద్ది ముందు ఎందుకు తన క్లయింట్‌ను అరెస్టు చేయాల్సి వచ్చిందో చెప్పాలని కేజీవ్రాల్ తరఫు లాయర్ అభిషేక్ మను సింఘ్వి తన వాదనల సందర్భంగా ప్రశ్నించారు. దీనిపై అత్యున్నత న్యాయస్థానం స్పందిస్తూ, 'స్వేచ్ఛ అనేది చాలా ముఖ్యమైన అంశం' అని స్పష్టం చేసింది. లోక్‌సభ ఎన్నికలకు ముందు అరెస్టుపై కేజీవ్రాల్ అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పాలని ఈడీ తరఫు న్యాయవాదిని జస్టిస్ సంజీవ్ ఖన్నా ఆదేశించారు. వచ్చే శుక్రవారం మధ్యాహ్నం లోగా స్పందన తెలియజేయాలని ఈడీకి గడువు విధించారు. కాగా, ఈ నెల ప్రారంభంలో కేజీవ్రాల్ అరెస్టును ఢిల్లీ హైకోర్టును సమర్థించింది. దర్యాప్తునకు ఆయన సహకరించనందు వల్లే అరెస్టు చేయడం మినహా ఈడీకి మరో గత్యంతరం లేకపోయిందని కోర్టు అభిప్రాయపడింది. లోక్‌సభకు ఎన్నికలకు ముందు మార్చి 21న కేజీవ్రాల్‌ను ఈడీ అరెస్టు చేసింది.

## అమిత్ షాను ఆవరించిన కెసిఆర్ ఆత్మ

వరంగల్: కేసీఆర్ ఆత్మ అమిత్ షాను ఆవహించిందని.. అందుకే తనపై ఢిల్లీలో కేసు పెట్టారని సిఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. అమిత్ షా ఢిల్లీ నుంచి కాంగ్రెస్ భవన్ కు పోలీసులను పంపారని రేవంత్ రెడ్డి అన్నారు. పరకాల జన జాతర సభలో రేవంత్ రెడ్డి కేసీఆర్, నరేంద్ర మోదీలపై మండిపడ్డారు. దళితులు, గిరిజనులు, బీసీలు, మైనార్టీల పక్షాన నిలబడితే గుజరాత్ పెత్తందారులు, ఢిల్లీ సుల్తాన్ లు కేసు పెట్టారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. కార్యకర్తలు అండగా నిలబడితే ఢిల్లీ అయినా గుజరాత్ అయినా భయపడే ప్రసక్తే లేదని రేవంత్ రెడ్డి అన్నారు. కేంద్ర సంస్థలు అయిన ఈడీ, ఇన్కమ్ టాక్స్ లతో దాడులు చేయిస్తున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. తెలంగాణ పౌరుషం ఎవరి ముందు తల వంచేలా చేయబోదని అమిత్ షాను ఉద్దేశించి అన్నారు. ఢిల్లీ పోలీసులే కాదు, సరిహద్దుల సైన్యాన్ని దింపినా తెలంగాణకు ఎట్లా వస్తారో చూస్తానని రేవంత్ రెడ్డి సవాలు విసిరారు. నిజాం విముక్తి నుంచి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రానికి పట్టిన చీడ పీడ అయిన కేసీఆర్ ను వదిలించుకున్నామన్నారు. ఓటర్లు చంద్రశేఖర్ రావు లాంటి పాము తోక, నడుముపై తొక్కారని.. అందుకే చిన్నగా పడగలేస్తుందని రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. దేశంలో జరగబోయే ఎన్నికలు ఫైల్స్ అని.. కాంగ్రెస్ పార్టీకి ఓటువేసి రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయాలని అన్నారు. నామా నాగేశ్వరరావుకు మద్దతుగా కేసీఆర్ చేసిన ఎన్నికల ప్రచారంలో చేసిన వ్యాఖ్యలపైనా రేవంత్ రెడ్డి స్పందించారు. కేంద్రంలో హంగ్ వస్తుందని నామా నాగేశ్వరరావు మంత్రి అవుతారంటే దాని అర్థం ఏమిటని అన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ వేరు వేరు కాదని రేవంత్ రెడ్డి అన్నారు. రెండు పార్టీల ఆలోచనలు, ఎన్నికల విధానం ఒక్కటేనని అన్నారు. ఆరూరి రమేష్ ను బీఆర్ఎస్ నుంచి బీజేపీలోకి పంపారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. బీజేపీని గెలిపించడానికి బీఆర్ఎస్ కుట్ర చేస్తుందని ఆయన అన్నారు. తెలంగాణ ప్రజలారా మీ ఆత్మ గౌరవాన్ని బీజేపీకి కేసీఆర్ తాకట్టు పెట్టారని అన్నారు. కేసీఆర్ మాటలతో బీజేపీ బీఆర్ఎస్ పొత్తు స్పష్టమైపోయిందని రేవంత్ రెడ్డి అన్నారు. బీజేపీ ఎన్నికల ముందు చంద్రబాబుతో పొత్తు పెట్టుకుందని.. ఎన్నికల తర్వాత కేసీఆర్ తో పొత్తు పెట్టుకోబోతుందని రేవంత్ రెడ్డి అన్నారు. అన్ని వర్గాల ప్రజలు ఏకమై బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ బస్సు యాత్ర తిక్కలోడు తిరునాళ్లకు పోయినట్టే ఉందని అటు ఇటు ఎక్కుడు దిగుడే సరిపోతుందని రేవంత్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యను రెండు లక్షల మెజార్టీతో గెలిపించాలని రేవంత్ రెడ్డి పిలుపు ఇచ్చారు. అంబేడ్కర్ సిద్దాంతాలను అవలంబిస్తూ కాంగ్రెస్ పార్టీ రిజర్వేషన్లు ఇచ్చింది కాబట్టే అనేక మంది దళిత, గిరిజనులు ప్రజాప్రతినిధులు అయ్యారని రేవంత్ రెడ్డి అన్నారు.

## కోవిడ్ వ్యాక్సిన్‌పై మరో దుమారం

**దుష్ప్రభావాలు ఉన్నాయని గుర్తింపు**

**న్యూఢిల్లీ:** కొవిడ్-19 వ్యాక్సిన్‌పై మరోసారి వివాదం ముసురుకుంది. ఇన్నాళ్లు దీనిపై రకరకాల వాదనలు వినిపిస్తున్నప్పటికి అధికారికంగా ఎవరూ సైడ్‌ఎఫెక్ట్స్‌ను ఎత్తి చూపలేదు. ఈ కొవిడ వ్యాక్సిన్‌తో దుష్ప్రభావాలు ఉన్నాయని తొలిసారిగా ఆస్ట్రాజెనెకా ఫార్మాస్యూటికల్ దిగ్గజం నోరు విప్పింది. యునైటెడ్ కింగ్‌డమ్ హైకోర్టు సమర్పించిన డాక్యుమెంట్స్‌లో కీలక అంశాలను వెల్లడించింది ఆస్ట్రాజెనెకా సంస్థ. చాలా అరుదైన సందర్భాల్లో వచ్చే టీటీఎస్‌కి కొవిడ్ -19 వ్యాక్సిన్ కారణం కావచ్చని పేర్కొంది. టీటీఎస్ అంటే థ్రాంబోసిస్ విత్ థ్రాంబోసైటోపెనియా సిండ్రోమ్. ఈ వ్యాధి కారణంగా రక్తం గడ్డకట్టడం జరుగుతుందని అదే టైంలో రక్తంలోని ప్లేట్‌లెట్ కౌంట్‌ను కూడా తగ్గిస్తుందని తెలిపిందని టెలిగ్రాఫ్ పేర్కొంది. కోవిషీల్డ్‌తోపాటు వాక్స్ప్రియా వ్యాక్సిన్‌ను ఆస్ట్రాజెనెకా, అక్స్‌ఫర్డ్ యూనివర్శిటీ కలిసి రూపొందించాయి. ఈ వ్యాక్సిన్ అందుబాటులోకి వచ్చిన తర్వాత అనేక ఆరోపణలు వచ్చాయి. దీని వల్ల రోగులు వేరే వ్యాధుల బారిన పడుతున్నారని చాలా మంది వైద్యులు మొత్తుకున్నారు. కానీ ఆస్ట్రాజెనెకా మాత్రం వాటిని ఖండిస్తూ వచ్చింది. కోర్టుల్లో కూడా చాలా కేసులు ఈ వ్యాక్సిన్‌పై వేశారు.

ఇన్నాళ్లకు వాటన్నింటికీ ఫుల్‌స్టాప్ పెడుతూ తాము తయారు చేసిన వ్యాక్సిన్ వల్ల సైడ్‌ఎఫెక్ట్ ఉన్నట్టు కోర్టుకు తెలిపింది ఆస్ట్రాజెనెకా. ఈ వ్యాక్సిన్ వల్ల చాలా మంది తీవ్రమైన అస్వస్థతకు గురవుతున్నారని వేర్వేరు వ్యాధులతో ఇబ్బంది పడుతున్నారని కేసులు రిజిస్టర్ అయ్యాయి. కొందరు కోర్టులను కూడా ఆశ్రయించారు. ఈ కంపెనీకి వ్యతిరేకంగా మొదటి కేసును జామీ స్కాట్ అనే వ్యక్తి దాఖలు చేశాడు. 44

ఏళ్ల స్కాట్ వ్యాక్సిన్ తీసుకున్న పది రోజులకే అస్వస్థతకు గురయ్యారు. అప్పుడే అతన్ని ఆసుపత్రిలో చేర్పిస్తే వ్యాక్సిన్ వల్ల వచ్చే ఇమ్యూన్ థ్రోంబోసైటోపెనియాగా వైద్యులు అనుమానించారు.

స్కాట్ తాత్కాలికంగా కోలుకున్నా పూర్తిగా ఆరోగ్యవంతుడు కాలేకపోయాడు. ఆయన మెదడు దెబ్బతింది. ఆ వ్యక్తి బతకడం కష్టమని పదే పదే వైద్యులు కుటుంబాని చెపుతూ వచ్చారు. దీనంతటికీ వ్యాక్సినే కారణమని గ్రహించిన స్కాట్ ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించారు. ఆయనతోపాటు సుమారు 51 కేసులు నమోదు అయ్యాయి. వీళ్లంతా వంద మిలియన్ డాలర్లు నష్టపరిహారం సంస్థ నుంచి కోరుతున్నారు.

ఇన్నాళ్లూ ఈ ఆరోపణలు ఖండిస్తూ వచ్చింది ఆస్ట్రాజెనెకా. టీటీఎస్ కు కారణం వ్యాక్సిన్ అనే వాదనతో తాము ఏకీభవించబోమంటూ వాదిస్తూ వచ్చారు. ఇన్నాళ్లు తప్పు అన్నది ఇప్పుడు ఒప్పుకుందా సంస్థ. ఫిబ్రవరిలో కోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో సంస్థ ఇలా చెప్పుకొచ్చింది. ' ఏజెడ్ టీకా వల్ల చాలా అరుదైన సందర్భాల్లో టీటీఎస్‌కి కారమమవుతుందని గ్రహించాం. దీనికి కారణాలు మాత్రం తెలియడం లేదు. బాధితుల తరఫున వాదించిన లాయర్లు... వ్యాక్సిన్ లోపభూయిష్టంగా ఉందని వాదించారు. ప్రజల్లో ఉన్న అపోహలు తొలగించడంలో కూడా సంస్థ ప్రయత్నించలేదని మార్కెట్‌లోకి వదిలారంటూ వాదించారు. దీన్ని ఆస్ట్రాజెనెకా సంస్థ లాయర్లు ఖండించారు. ఈ కరోనా వ్యాక్సిన్‌పై తొలి కేసు వేసిన జామీస్కాట్ భార్య ది టెలిగ్రాఫ్ పత్రికతో మాట్లాడుతూ జామీ పరిస్థితికి ఆస్ట్రాజెనెకా , ఆ సంస్థ తయారు చేసిన వ్యాక్సిన్ మాత్రమే కారమణని వాపోయారు. ఈ లోపాన్ని ప్రపంచమంతా గుర్తించిందని తెలిపారు. ఇప్పుడు వాళ్లు అంగీకరించడానికి మూడేళ్ల సమయం పట్టిందని నిజంగా ఇదో పెద్ద పురోగతిగా అభిప్రాయపడ్డారు.

## స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు

**న్యూఢిల్లీ:**దేశంలో బంగారం, వెండి ధరలు స్వల్పంగా తగ్గుముఖం పడుతున్నాయి. ఏప్రిల్ నెలలో పరుగులు పెట్టిన పసిడి ధర.. నెల చివరిలో కాస్త స్వల్పంగా తగ్గుతూ వస్తోంది. ఏప్రిల్ 30వ తేదీన పది గ్రాముల బంగారం ధరపై స్వల్పంగా తగ్గింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.66,540 ఉండగా, 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధరపై రూ.72,590 ఉంది. ఇక దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరలు ఇలా ఉన్నాయి. చెన్నైలో 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ ధర రూ.67,390 ఉండగా, 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.73,520 ఉంది. ఇక దేశ ఆర్థిక రాజధాని ముంబైలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.66,540ఉండగా, 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.72,590 ఉంది. దేశ రాజధాని ఢిల్లీలో 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ ధర రూ.66,690 ఉండగా, 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.72,740 ఉంది. ఇక హైదరాబాద్‌లో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.66,540 ఉండగా, 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.72,590 ఉంది. విజయవాడలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 66,540 ఉండగా, 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.72,590 ఉంది. ఇక దేశంలో కిలో వెండి ధర రూ.83,900 ఉంది.ఇండియన్ బులియన్ జువెలర్స్ అసోసియేషన్ విడుదల చేసిన ధరలు వివిధ స్వచ్ఛతలతో కూడిన బంగారం ప్రామాణిక ధర గురించి సమాచారాన్ని అందజేస్తాయి. ఈ ధరలన్నీ పన్ను, మేకింగ్ ఛార్జీలకు ముందు ఉంటాయి. కానీ వాటి ధరలలో జీఎస్టీ ఉండదు. ఆభరణాలను కొనుగోలు చేసేటప్పుడు, పన్నులు కూడా ఉన్నందున బంగారం లేదా వెండి ధరలు ఎక్కువగా ఉంటాయని గుర్తించుకోవాలి. మీరు బంగారాన్ని కొనుగోలు చేయాలనుకుంటే బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ హాల్‌మార్క్‌తో ఎల్లప్పుడూ ధృవీకరించబడిన బంగారాన్ని కొనుగోలు చేయాలి.

# పది ఫలితాల్లో "కాకతీయ" విజయ కేతనం.

**ప్రణాళిక ప్రకారం చదవడం వల్లే..**
**- టీ. నిత్యాశ్రీ.**

కాకతీయ ఒలంపియాడ్ స్కూల్ లో ఫస్ట్ క్లాస్ నుండీ క్రమ శిక్షణతో చదువుతున్నాను. ప్రణాళిక ప్రకారం చదవడం, టీచర్ల పర్యవేక్షణ, ఇంటర్ లెక్చరర్స్ ద్వారా బోధన జరగడం వల్ల పదవతరగతి పరీక్ష ఫలితాల్లో 10 జిపిఎ సాధించడం జరిగింది. భవిష్యత్తులో ఉన్నత స్థానంలో ఉండాలని కోరిక.

**ఉపాధ్యాయుల నిరంతర పర్యవేక్షణ.**
**- వై. రితేష్ రెడ్డి.**

ఉపాధ్యాయుల నిరంతర పర్యవేక్షణ, వచ్చిన సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేసేవారు. అందువల్లే పది ఫలితాల్లో 10 జిపిఎ సాధించడం జరిగింది. ఉత్తమ ఫలితాలు సాధించడం పట్ల మా తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. కాకతీయ లో చదివినందుకు గర్వపడుతున్నాం.

**ఐఐటి లో సీటు సాధించడం లక్ష్యం.**
**- ఎం. ఆశ్రిత**

కాకతీయ ఒలంపియాడ్ స్కూల్ లో మొదటి తరగతి నుండి చదువుతున్నాను. ప్రణాళిక బద్ధమైన తరగతులు, టీచర్ల నిరంతర పర్యవేక్షణ వల్ల పదవతరగతి పరీక్ష ఫలితాల్లో 10 జిపిఎ సాధించాను. ఐఐటి లో సీటు సాధించడం నా లక్ష్యం.

**రోబోటిక్ తరగతులు ఉపయోగ పడ్డాయి.**
**- నిత్య షాహా.**

మొదటి తరగతి నుండి కాకతీయ ఒలంపియాడ్ స్కూల్ చువుతున్నాను. నిరంతరం టీచర్ల పర్యవేక్షణ తో పాటు రోబోటిక్ తరగతులు సాంకేతిక విద్యను అభ్యసించడం వల్ల పదవతరగతి పరీక్ష ఫలితాల్లో మంచి మార్కులు సాధించాను. భవిష్యత్తులో ఐఐటి లో సీటు సాధించి, ఉన్నత స్థాయికి ఎదగాలని లక్ష్యం.



T. Nithya Sree
2405105994
10/10 GPA



Y. Rithesh Reddy
2405105732
10/10 GPA



K. Jason
2405105620
10/10 GPA



Nithya Shah
2405105660
10/10 GPA



B. Hasini
2405106210
10/10 GPA



M. Ashritha
2405106156
10/10 GPA



A. Vachan
2405104507
10/10 GPA



Y. Srihitha
2405104275
10/10 GPA

**వేగుచుక్క న్యూస్, నిజమాబాద్, ఏప్రిల్ 30:**

పదవతరగతి పరీక్ష ఫలితాల్లో కాకతీయ విద్యార్థులు విజయ కేతనం ఎగురవేశారు. 8 మంది విద్యార్థులకు 10/10 జిపిఏ సాధించగా, 33 (9.8), 60 (9.7), 144 (9.5) జిపిఏలతో సంచలనం సృష్టించారు. టి. నిత్యాశ్రీ, వై. రితేష్ రెడ్డి, కె.జాసన్, నిత్యాసాహ, బి.హాసిని, ఎం. ఆశ్రిత, ఎ. వచన్, వై. శ్రీహిత 10 జిపిఎ సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కాకతీయ విద్య సంస్థల ఛైర్పర్సన్ సిహెచ్. విజయలక్ష్మి మాట్లాడారు. బిడ్డల్ని ప్రేమించే తల్లిదండ్రులకు... ఆ బిడ్డల భవితకు రూపమిచ్చే కాకతీయ అధ్యాపక బృందానికి... ఈ ఫలితాలు తరగని,

**8 మంది విద్యార్థులకు 10/10 జిపిఏ.**
**33 (9.8), 60 (9.7), 144 (9.5) జిపిఏలతో సంచలనం.**
**నాణ్యమైన విద్య కు ఫలితాలే నిదర్శనం.**
**సంస్థ చైర్పర్సన్ సిహెచ్. విజయలక్ష్మి.**

చెరగని ఆత్మీయ బంధాలుగా నిలుస్తాయని అన్నారు. నాణ్యమైన విద్యకు వచ్చిన ఫలితాలే నిదర్శనం అని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తున్న అధ్యాపక బృందాన్ని విజయలక్ష్మి అభినందించారు. స్కూలు స్థాయి నుండే ఐఐటి ఫౌండేషన్ కోర్సుని కళాశాల లెక్చరర్లచే విద్యాబోధన మూలంగా, ఇంటర్ నేషనల్ లెవల్ పర్సనాలటి డెవలప్మెంట్ శిక్షకుల ద్వారా బోధన చేయడం మూలంగా SSC లో 10/10 గ్రేడు అవలీలగా సాధించగలిగారని వివరించారు.కాకతీయ విద్య సంస్థల డైరక్టర్లు సిహెచ్. తేజస్విని, సిహెచ్. రామోజీ రావు, ప్రిన్సిపాల్ పరీదుద్దీన్ మాట్లాడుతూ, ఇంతటి అద్భుతమైన విజయాలకు కారకులైన కాకతీయ విద్యార్థినీ, విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. విశేషమైన కృషినందించిన అధ్యాపక బృందానికి, ప్రోత్సాహాన్ని అందించిన తల్లిదండ్రులకు వారు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాకతీయ ఒలంపియాడ్ స్కూల్ ప్రిన్సిపాల్స్, పి.వి. నటరాజ్, యం. గిరిధర్ రాజ్, చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

# నలందలో 'పది' ప్రభంజనం

**- విద్యార్థులను అభినందించిన యాజమాన్యం ప్రసాద్, సాగర్.**







**వేగుచుక్క న్యూస్, ఆర్మూర్, ఏప్రిల్ 30**

పట్టణంలోని మామిడిపల్లిలో గల నలంద హై స్కూల్ విద్యార్థులు మంగళవారం విడుదలైన తెలంగాణ పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ జిపిఏ సాధించారు. పదవ తరగతి ఫలితాలలో ఆర్మూర్ డివిజన్లోనే 10 %ుూూ% సాధించిన లక్కారం తనుశ్రీ (10/10)నీ నలంద యాజమాన్యం ప్రసాద్, సాగర్ శాలువా, పుష్పగుచ్చాలతో సన్మానించి అభినందించారు. అలాగే నోవిక (9.7), వర్శిత్ (9.5), అక్షయ (9.3), కీర్తన (9.3),ఇందు(9.3), అయేషా(9.2), లిఖిత్ (9.2) మరియు పావని(9.0) ఉత్తమ GPAసాధించిన విద్యార్థులను వారి తల్లిదండ్రుల సమక్షంలో శాలువాలతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా కరెస్పాండెంట్ ప్రసాద్ మాట్లాడుతూ, గత దశాబ్ద కాలంగా 100% ఉత్తీర్ణత సాధిస్తున్న ఏకైక విద్యా సంస్థ నలంద హై స్కూల్ అని అన్నారు. తమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ...చదువుతోపాటు సంస్కృతి, సాంప్రదాయాలను నేర్చుకొని బావి భారత పౌరులుగా మార్చే ప్రయత్నం లో అధ్యాపక బృందం తోడ్పడతారని తెలిపారు. ప్రిన్సిపాల్ సాగర్ మాట్లాడుతూ, తమ పాఠశాల విద్యార్థులు సర్వతోముఖాభివృద్ధిగా నేటి సమాజానికి అనుగుణంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. మంచి GPAసాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు నలంద యాజమాన్యానికి,అధ్యాపక బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

## లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి ప్రియింక దూరం
## ఎన్నికల ప్రచారంలో పాల్గొనేలా వ్యూహం

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండాలని కాంగ్రెస్ అగ్ర నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఒక్క సీటు నుంచి పోటీ చేయకుండా దేశవ్యాప్తంగా ప్రచారం చేస్తే పార్టీకి మంచి ఫలితాలు వస్తాయని ఆమె భావిస్తున్నట్లుగా సమాచారం. అంతేకాకుండా తాను పోటీ చేస్తే వారసత్వంపై విమర్శలను ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రియాంక అభిప్రాయపడుతున్నట్లు సమాచారం. ఈ క్రమంలో పోటీకి దూరంగా ఉంటూ పార్టీ తరుపున ప్రచారం చేయాలని ప్రియాంక ఫిక్స్ అయినట్లుగా తెలుస్తోంది. మే 3వ తేదీ నుంచి ఆమె యూపీలో ప్రచారం ప్రారంభించనున్నట్లు సమాచారం. ఉత్తర్‌ప్రదేశ్‌లోని అమేథీ, రాయ్‌బరేలీ లోక్ల సభ స్థానాల్లో ఎవరు పోటీ చేస్తారనేదానిపై మరో 24 గంటల్లో క్లారిటీ రానుంది. అమేథీ నుంచి పోటీ చేసేందుకు ప్రియాంక భర్త రాబర్ట్ వాద్రా ఆసక్తి చూపుతున్నట్లుగా తెలుస్తోంది. ఈ రెండు స్థానాలకు ఐదో విడతలో భాగంగా మే 20వ తేదీన ఎన్నికలు జరగనున్నాయి.

ఇక అమేథీ నుంచి బీజేపీ తమ అభ్యర్థిగా స్మృతి ఇరానీని ప్రకటించగా ఆమె నిన్న నామినేషన్ వేశారు. ఇక రాహుల్ గాంధీ గతంలో కేరళలోని వాయనాడ్ నుంచి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసి భారీ మెజార్టీతో గెలిచారు. దీంతో మళ్లీ అక్కడినుంచే పోటీకి దిగారు.

## పదేళ్ల పాలనలో అన్నీ అవినీతి, అక్రమాలు

**అయినా మళ్లీ అబద్దాలతో మోసం చేసే యత్నం**
**కెసిఆర్ వ్యాఖ్యలపై మండిపడ్డ భట్టి విక్రమార్క**

**ఖమ్మం:** పదేళ్లు పాలన చేసిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నోటికొచ్చిన అబద్దాలు మాట్లాడుతున్నారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. చేసిన పాపాలపై స్పందించకుండా ప్రజల దృష్టిని మళ్లించేందుకు నానా తంటాలు పడుతున్నారని మండిపడ్డారు. తాము చేసిన ఆరోపణలపై ఇంతవరకు స్పందించలేదన్నారు. పదేళ్ల పాటు రాష్ట్రాన్ని అప్పులకుప్పగా చేసి, చిప్ప అందించిన ఘనుడు కెసిఆర్ అన్నారు. మంగళవారం కూసుమంచిలో కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో భట్టి మాట్లాడుతూ.. డబుల్ బెడ్ రూం ఇళ్ళు, ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పి ఒక్క హామీని కూడా అమలు చేయని ఆయన ఈరోజు మాట్లాడుతున్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలో రాగానే ఇచ్చిన హామీల్లో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, రెండు వందల ఉచిత విద్యుత్, ఆరోగ్య శ్రీ, రూ.500 కే గ్యాస్ పథకాలు అమలు చేశామని తెలిపారు. రైతులపైన కాంగ్రెస్ పార్టీకి నిబద్ధత ఉందన్నారు. తాము వచ్చిన మూడు నెలల్లోనే రైతులకు ఇన్సూరెన్స్ కట్టించామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యార్థుల మెస్ బిల్లులు కట్టకపోతే కాంగ్రెస్ ప్రభుత్వం కట్టిందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు మొదటి తారీకునే జీతాలు ఇస్తున్నామన్నారు. సిగ్గులేకుండా కరెంటు పోతుందని మాజీ ముఖ్యమంత్రి తన స్థాయిని మర్చిపోయి అబద్దాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. గత ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌ను బండకేసి బాది ఇందిరమ్మ రాజ్యం తెచ్చుకున్నారన్నారు. రామచంద్రస్వామి సన్నిధిలో పేదలకు ఇళ్ళు ఇవ్వాలని నిర్ణయించామని తెలిపారు. ప్రతి నియోజకవర్గానికి ఐదు వేలు ఇళ్ళు ఇస్తామని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇంటికి ఎస్సీ, ఎస్టీలకు రూ.6 లక్షలు ఇస్తామన్నారు. ఈ దేశ సంపదను వారికి అనుకూలంగా ఉన్న వారికి దోచిపెడుతు న్నారని ఆరోపించారు. బీఆర్ఎస్, బీజేపీ చేతులు కలిపి దేశాన్ని దోపిడీ చేయాలని చూస్తున్నారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని భట్టి విక్రమార్క కోరారు.

# ఎస్ఎస్ సి ఫలితాలలో "సత్యశోధక్" విజయభేరి.

**- విద్యార్థులను సన్మానించి ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య.**




**వేగుచుక్క న్యూస్, సిరికొండ, ఏప్రిల్ 30**

పదవ తరగతి 2024 ఫలితాలలో సత్యశోధక్ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విజయభేరి మోగించారు. పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు వి. భార్గవ్ రెడ్డి, కే. దామోదర్ గౌడ్, టి. రతీష్, జి. నిత్యశ్రీ లకు 10/10 GPA సాధించారు. వీరితో పాటు 9.8 GPA సాధించిన జి. నిత్య, జి. వర్షిణీ, యం. వైష్ణవి, యన్. భానువ్య, పి. బ్లెస్సీ, ఆర్. సంజన, డి. నీరజ్ రాథోడ్, జి. శ్రీకాంత్ లు సాధించారు. వీరితో పాటు 9.7GPA12 మంది విద్యార్థులు, 9.5 GPA 11 మంది విద్యార్థులు 9 పాయింట్లకు పైగా 50 విద్యార్థులు పొందడంతో పాటు వందశాతం 83/83 ఉత్తీర్ణత పొందారు. అత్యుత్తమ GPA సాధించిన విద్యార్థులను మంగళవారం పాఠశాలలో ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య సత్కారించారు. ఈ సందర్భంగా ఆర్. నర్సయ్య మాట్లాడుతూ, నిరంతర శ్రమ, పట్టుదల ఆత్మవిశ్వాసంతో విద్యాభ్యాసం చేస్తే అద్భుత ఫలితాలు సాధించ గలమని అందుకు ఈ అత్యుత్తమ ఫలితాలే నిదర్శనమన్నారు.

గ్రామీణ ప్రాంతంలో నాణ్యమైన విద్యను అందిస్తూ విద్యార్థుల సర్వతోముకాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ అత్యుత్తుమ ఫలితాలను సాధిస్తున్న ఏకైక పాఠశాల సత్యశోధక్ పాఠశాల అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



# ఇంటర్ ఫలితాల పై సమీక్ష.

**ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు.**

**ఇంటర్ విద్య అధికారి రవికుమార్.**

**వేగుచుక్క న్యూస్, నిజమాబాద్, ఏప్రిల్ 30:**

2023-24 విద్యా సంవత్సరానికి ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాలలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫెయిల్ అయిన విద్యార్థులకు తరగతులను నిర్వహించి వారి ఉత్తీర్ణతకు కృషి చేస్తున్నామని జిల్లా ఇంటర్ విద్యాధికారి టి. రవికుమార్ తెలియజేశారు. ఇంటర్ వార్షిక పరీక్షలలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల లో సాధించిన ఫలితాలపై జిల్లా ఇంటర్ విద్య అధికారి మంగళవారం తన కార్యాలయంలో ప్రిన్సిపాల్ లతో సమీక్ష నిర్వహించారు. సబ్జెక్టుల వారీగా వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ప్రిన్సిపాల్ లను ఉద్దేశించి మాట్లాడుతూ, ఇంటర్ బోర్డు నిర్ణయం మేరకు ఆయా ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్ లు సబ్జెక్టుల వారీగా ఫలితాలను సమీక్షించి ఆయా సబ్జెక్టుల లెక్చరర్ల ద్వారా వెంటనే బోధనా తరగతులను ప్రారంభించాలని ఆదేశించారు. ఈ తరగతులు ఫెయిల్ అయిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ నెల 24వ తేదీ నుండి నిర్వహించనున్న సప్లమెంటరీ పరీక్షలకు హాజరు కాబోతున్న విద్యార్థులందరూ ఈ తరగతులను హాజరుకావాలని అన్నారు. కాగా ఫెయిల్ అయిన విద్యార్థులకు వెంటనే పరీక్ష ఫీజులు చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆయా సబ్జెక్టులలో తరగతులను నిర్వహించేందుకు అధ్యాపకుల సేవలను కచ్చితంగా వినియోగించుకోవాలని ప్రిన్సిపాల్ లను ఆదేశించారు. విషయ పరిజ్ఞానం తక్కువగా ఉన్న విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని వారు ఉత్తీర్ణత సాధించే విధంగా కృషి చేయాలని ఆదేశించారు. ప్రతి కళాశాలలో 100 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులు అయ్యే విధంగా సప్లిమెంటరీ పరీక్షలకు సంసిద్ధం చేయాలని అన్నారు.

సబ్జెక్టుల వారీగా ఉత్తీర్ణత తక్కువ సాధించడానికి గల కారణాలను కూడా జిల్లా ఇంటర్ విద్య అధికారి అడిగి తెలుసుకున్నారు.

పేద, బడుగు, మైనారిటీ, బలహనవర్గాలకు చెందిన విద్యార్థులు చదివే ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రతి ప్రిన్సిపాల్ తరగతులు నిర్వహణ పై ఖచ్చితంగా వ్యవహరించాలని అన్నారు.

# పది ఫలితాల్లో "లయోల" విద్యార్థుల హవా.
















**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, ఏప్రిల్ 30:**

ఎస్ఎస్ సి పరీక్ష ఫలితాల్లో లయోల విద్యార్థులు ఎప్పటిలాగే ఈసారి కూడా 100% ఉత్తీర్ణులై విజయదుందుభి మోగించారు. యం. అక్షయ, బి.యన్. నక్షత్ర, ఒనేజా ఫాతిమ, మలిహా సలీమ్, యం. రిషిత లు 10/10 GPA లు సాధించారు. అలాగే 9.8 GPA 6, 9.7 GPA 9, 67 మంది విద్యార్థులు 9.0 GPA లకుపైగా సాధించినందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.బి. చారి సంతోషం వ్యక్తం చేశారు. ఈ విజయానికి కృషిచేసిన విద్యార్థులను అభినందిస్తూ, సహకరించిన

# ఎస్ఎస్ సి ఫలితాలలో "ఆర్కిడ్స్" విజయకేతనం.














**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, ఏప్రిల్ 30:**

పట్టణంలోని ఆర్కిడ్స్ పాఠశాల విద్యార్థులు పది పరీక్ష ఫలితాల్లో 10 GPA తో పాటు అత్మధిక విద్యార్థులు 9.8, 9.7, 9.5 GPA మరియు 9.0 GPA సాధించి సత్తా చాటారు. ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా 9,0 GPA మరియు ఆపైన ఫలితాలను విద్యార్థులు సొంతం చేసుకున్నారు అని యాజమాన్యం తెలిపారు. ఈ ఫలితాలలో యస్. భువనసింధు 10GPA, వి.బిందుప్రియ 9.8, కె.తన్మయి 9.8, యస్. విజ్ఞశ్రీ 9.8 లతో పాటుగా బి. సంకీర్త్ రెడ్డి 9.7, యం. దీపికా 9.7, బి. సహస్రా 9.7, పి. సహస్ర 9.7 మరియు సి. హెచ్. శ్రేష్టారెడ్డి 9.5, ఏ.కీర్తి 9.5, కె.సార్ధిక 9.5, జి.నవనీత్ గౌడ్ 9.5 గ్రేడులను సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్, ప్రిన్సిపాల్ సి.హెచ్. గోవర్ధన్ రెడ్డి, ఆర్ కె . గ్రూప్ ఆఫ్ ఇన్స్టూషన్ సిఇఓ ఎం. జైపాల్ రెడ్డి, డైరెక్టర్ సదాశివరెడ్డి విద్యార్థిని, విదార్థులను అభినందిస్తూ, వారికి సవాకరించిన తల్లిదండ్రులకు, ఉపాధ్మాయులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# కాంగ్రెస్ దిగజారుడు రాజకీయాలకు పరాకాష్ఠ

**న్యూఢిల్లీ:** రిజర్వేషన్ల రద్దుపై కాంగ్రెస్ రాజకీయ లబ్ధి కోసం దుష్ప్రచారలకు తెగించిందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా మండిపడ్డారు. దిగజారుడు రాజకీయాలకు ఇది పరాకాష్టగా చెప్పుకొచ్చారు. అమిత్ షా చెప్పినట్లు ఉన్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన సంగతి
తెలిసిందే. తాజాగా అమిత్ షా దీనిపై స్పందిస్తూ.. కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు చేశారు. ఆ పార్టీ అసహనంతోనే ఫేక్ వీడియోలు తయారు చేస్తోందని మండిపడ్డారు. తమ మాటలు వక్రీకరించి దుష్ప్రచారం చేస్తోందని దుయ్యబట్టారు. అయితే మతం ఆధారంగా రిజర్వేషన్లు ఇచ్చేందుకు భాజపా వ్యతిరేకమని మరోసారి స్పష్టం చేశారు. '400 సీట్లు దక్కించుకున్న తర్వాత భాజపా రిజర్వేషన్లను రద్దుచేస్తుందంటూ కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోంది. ఆ మాటలన్నీ నిరాధారమైనవి. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లకు మా పార్టీ మద్దతు ఎప్పుడూ ఉంటుందని స్పష్టం చేసారు. నాతోపాటు మా పార్టీకి చెందిన ఇతర నేతల నకిలీ వీడియోలను ప్రచారం చేసే స్థాయికి వారి అసహనం పెరిగిపోయింది. ముఖ్యమంత్రులు, ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, ఇతరులు ఈ ఫేక్ వీడియోను వ్యాప్తి చేశారు. ప్రస్తుతం ఆ పార్టీకి చెందిన ఒక ప్రముఖనేత క్రిమినల్ నేరాన్ని ఎదుర్కొంటున్నారు. ఇవన్నీ వారి అసంతృప్తిని వెల్లడి చేస్తున్నాయి. రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీ బాధ్యతలు తీసుకున్న నాటి నుంచి రాజకీయాలను మరింత దిగజార్చేపనిలో ఉన్నారు. ఈ తరహా దృశ్యాలను ప్రచారం చేసి, ప్రజల మద్దతు కూడగట్టుకునే ప్రయత్నం చేయడం ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదు. ఏ ప్రధాన పార్టీ కూడా ఇలాంటి చర్యలకు పాల్పడకూడదు' అని అమిత్ షా అన్నారు. తప్పుడు ప్రచారంతో కాంగ్రెస్ ప్రజల్లో అయోమయం సృష్టించే ప్రయత్నం చేస్తోందన్నారు. ఫేక్ వీడియోలతో కావాలనే తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు. ఎప్పుడైనా..ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లు రక్షించేది బీజేపీ అన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లకు మద్దతిచ్చేది కూడా బీజేపీనే అని చెప్పారు. ఇదే విషయాన్ని తాను గతంలో ప్రధాని నరేంద్ర మోదీకి కూడా చెప్పినట్లుగా అమిత్ షా గుర్తుచేశారు. గౌహతిలో విలేకరుల సమావేశంలో అమిత్ షా ఈ కామెంట్స్ చేశారు.
2023లో హోంశాఖ మంత్రి అమిత్ షా మాట్లాడిన వీడియోను ఎడిట్ చేసిన వీడియో సోషల్ మీడియాలో షేర్ చేయగా అది వైరల్ గా మారింది. అందులో అమిత్ షా.. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లను రద్దు చేస్తామని మాట్లాడినట్లుగా ఉంది. దీంతో రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో 400 సీట్లు దాటితే రిజర్వేషన్లను రద్దు చేసేందుకు బీజేపీ సిద్ధమవుతోందంటూ పలువురు కాంగ్రెస్ నాయకులు కామెంట్స్ చేస్తున్నారు. ఈ ఫేక్ వీడియోను కేంద్ర హోంశాఖ సీరియస్ గా తీసుకుంది. హైదరాబాద్ తో పాటుగా పలు ప్రాంతాల్లో కేసులు నమోదయ్యాయి. కర్ణాటకలో తమ మిత్రపక్షం జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణకు సంబంధించినవిగా చెప్తున్న అభ్యంతరకర వీడియోలపై స్పందించారు. 'దేశంలో మేం మాతృ శక్తికి అండగా నిలుస్తామన్నది స్పష్టం. అక్కడ అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఇంతవరకు ఎందుకు చర్యలు తీసుకోలేదు. అది ఆ రాష్ట్ర శాంతిభద్రతల అంశం. మేం విచారణకు అనుకూలంగా ఉన్నాం. ఆ ఘటనపై చర్యలు తీసుకుంటామని జేడీఎస్ కూడా ఇప్పటికే ప్రకటించింది' అని తెలిపారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని నియోజకవర్గాలైన అమేఠీ, రాయబరేలీలో రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ పోటీ గురించి అడగ్గా..'వారు బరిలో ఉంటారా? లేదా? అనేది తెలీదు. అయితే వారిలో గందరగోళం చూస్తుంటే.. ఆత్మవిశ్వాసం లేనట్లు కనిపిస్తోంది. ఆ పార్టీ అగ్రనేతలు సొంత సీట్లను వదిలిపారిపోయిన పరిస్థితి ఉందని తెలిపారు.

# ప్రచారంలో..అందరూ జాదూగాళ్లే !

సిద్ధాంతాలు పక్కకు పోయాయి. సమస్యల ప్రస్తావన లేదు. ఎదుటివారిని బురిడీ కొట్టించడం..బురదజల్లడం, ఓట్లను లాగడం వంటి విద్యల్లో రాజకీయ నేతలు ఆరితేరారు. రాజకీయం లాభసాటి వ్యాపారంగా మారడంతో
అబద్దాలు ప్రచారం చేయడం..ఫేక్ వీడియోలు విడుదల చేయడం ఎన్నికల్లో సర్వసాధారణం అయ్యింది. ఓ మూడు నెలలు కష్టపడితే ఐదేళ్లు అధికారం వెలగబెట్టవచ్చు. ప్రజలను నిత్యం మోసం చేస్తూ ఉండవచ్చు. అందినకాడికి దోచుకోవచ్చు. ఇందుకు ఎవరూ అతీతులు కారు. అంతా ఒకే తాను ముక్కలు. ఇందులో ఒకరికి ఒకరు పోటీ పడుతున్న తీరు భారత ప్రజాస్వామ్యంలో వేళ్లూనుకుపోయింది. ప్రజలు పేదలుగా ఉండిపోవాలి. అడుక్కుతినే స్థితి నుంచి దాటి రావద్దు. ఉచిత బియ్యం, పెన్షన్లు, ఇళ్ల పందేరం, డబ్బుల పందేరం వంటివి చూపి ఓట్లు కొల్లగొట్టడం అలవాటు చేసుకున్నారు. దేశంలో కీలకమైన సమస్యలను పరిష్కరించే సత్తా నేతల్లో కానరావడం లేదు. సాగు,తాగునీటి సమస్యలను పరిష్కరించే ఉపాయాలు నేతల్లో లేవు. వ్యవసాయాన్ని ఎలా ముందుకు తీసుకుని వెళ్లవచ్చో..అన్న లోచనలు అస్సలు లేవు. పన్నులు పెంచడం, పందేరం చేయడంలో నేతలు పోటీ పడుతున్నారు. దీనికోసం మనమంతా ఓట్లు వేస్తున్నామని గుర్తించడం లేదు. ఎన్నికలలో ప్రజలను నమ్మించేందుకు అన్ని పార్టీలు కూడా మితిమీరిన వాగ్దానాలు చేయటం చూస్తున్నాం. అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారు. పరస్పర ఆరోపణలు చేసుకోవటం హద్దులు దాటింది. కొత్తగా వీడియోలు మార్ఫింగ్ చేయడం..చెప్పని డైలాగులు చొప్పించడం వంటివి కూడా చేస్తూ ఎదుటి వారిని ప్రజల్లో బద్నాం చేయడంలో నిష్ణాతులు అవుతున్నారు. ఈసారి చూస్తున్నంతగా అబద్దాలు, పరస్పర దూషణలు గతంలో ఎన్నడూ లేవు. తిట్టుకోవడంలో ఒకరిని మించి ఒకరు పోటీ పడుతున్నారు. సభ్య సమాజం ఒకటి ఉందన్న విషయం మరిచిపోయారు. సోషల్ మీడియా ముఖ్యంగా టీవీలు, యూట్యూబుల్లో ఈ పైత్యం పెరిగింది. రాజకీయ పార్టీల మధ్య పోటీ అన్నది పోయి..వ్యక్తుల మధ్య దూషణల పోటీలాగా ఎన్నికల ప్రచారం సాగుతోంది. మేనిఫెస్టోలను ప్రకటించినపుడు అలవిగాని హామీలు అన్నీ ఇందులో చోటు చేసుకుంటున్నాయి. కలిపి నోట్లో ముద్ద పెట్టడమే తరువాయి అన్నచందంగా హాల జాబితా తయారయ్యింది. ఇక విషయం ఏదైనా ప్రజల వద్దకు వెళ్లి విషప్రచారాలు చేసుకోవడంలో నైపుణ్యాలు ప్రదర్శిస్తున్నారు. అబద్దాలు, ఆరోపణలు, చివరకు ఎన్నడూ లేని విధంగా వ్యక్తిగత దూషణలు పెరుగుతున్నాయి. ప్రజాస్వామ్య వ్యవస్థ ఎంతగా పతనం అయ్యిందో తాజా ఎన్నికల ప్రచారం చూస్తే తెలుస్తుంది. తమ పాలనా కాలంలో చేసిన మంచిపట్ల ప్రజలకు విశ్వాసం కల్పించలేక పోతున్నారు. అందుకు కారణం.. సమస్యలను పరిష్కరించే సత్తా ప్రదర్శించలేక పోవడమే. అయినప్పటికీ అధికారం కోసం నానా గడ్డీ కరుస్తున్నారు. ప్రజలను మరోమారు వంచించాలంటే అబద్దాలే అవసరం అని గుర్తిస్తున్నారు. అబద్దాలతో, ప్రత్యర్థులపైన ఆరోపణలతో ఏదో ఒక విధంగా మెప్పించే ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి. తమ వైఫల్యాలను, బలహీనతలను ప్రజల దృష్టిలో మరుగునపడేట్లు చేయడం కోసం ఎదుటి పక్షంపై ఎంతకైనా తెగిస్తున్నారు. బురదజల్లుతున్నారు. ఇలా ప్రజల దృష్టిని పక్క దారి పట్టించేందుకు అవసరమైన టక్కుటమార, గజకర్ణ,గోకర్ణ విద్యలన్నీ ప్రదర్శిస్తున్నారు. అబద్దాలు, ఆరోపణలు, దూషణలతో హంగామా సృష్టించడంలో రాటుదేలారు. ఇలాంటి ప్రచారాలతో వ్యక్తులు స్థాయి, సంస్కృతి, సంస్కారం, నాగరికత, ప్రజాస్వామిక విలువలు పతనమవుతుండటం చూస్తున్నాం.

# శబరి నుంచి అలసిన ఊపిరి పాట విడుదల




కోలీవుడ్ బ్యూటీ వరలక్ష్మి శరత్‌కుమార్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న నటిస్తోన్న చిత్రం శబరి. అనిల్ కట్జ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం మల్టీలింగ్యువల్ ప్రాజెక్ట్‌గా తెరకెక్కుతోంది. ఇప్పటికే మేకర్స్ శబరి ప్రపంచాన్ని పరిచయం చేస్తూ రిలీజ్ చేసిన వీడియోలో? వరలక్ష్మి శరత్‌కుమార్ బైక్‌పై స్టైలిష్ గా రైడ్ చేస్తున్న విజువల్స్ ఆకట్టుకుంటున్నాయి. ఈ చిత్రం నుంచి అలసిన ఊపిరి సాంగ్‌ను లాంఛ్ చేశాడు డైరెక్టర్ కరుణకుమార్. వరలక్ష్మి సోలో ట్రాక్ సినిమాకు హైలెట్‌గా నిలవనుందని విజువల్స్ చూస్తే అర్థమవుతోంది. ఈ సందర్భంగా కరుణకుమార్ మాట్లాడుతూ.. పాట లిరిక్స్, విజువల్ ప్రెజెంటేషన్ నాకు బాగా నచ్చాయి. సినిమాలో చూపించిన తల్లీ కూతుళ్ల సెంటిమెంట్ యూనివర్సల్ స్థాయిలో ఉంది. సినిమా కోసం టీమ్ తమ మనస్సు పెట్టి పనిచేసింది. వరలక్ష్మి లేడీ ఓరియెంటెడ్ పాత్రలో అద్భుతంగా నటిస్తోంది. దర్శకుడు అనిల్ కట్జ్ చాలా ఆసక్తికరమైన విషయాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాడని మాత్రం ఖచ్చితంగా చెప్పగలనన్నాడు. వరలక్ష్మి శరత్ కుమార్ కూతురితో కలిసి అటవీ ప్రాంతంలో ఉన్న ఓ ఇంటికొస్తుంది. అయితే ఆ ఇంట్లోకి గుర్తు తెలియని ఆగంతుడు ప్రవేశిస్తాడు. ఇంతకీ ఆ ఇంట్లో ఏం జరిగిందనేది సస్పెన్స్ లో పెడుతూ కట్ చేసిన వీడియో సినిమాపై క్యూరియాసిటీ పెంచుతోంది. ఈ వీడియోతో సినిమాలో థ్రిల్లింగ్‌కు గురి చేసే అంశాలున్నట్టు చెబుతున్నాడు. శబరి చిత్రంలో గణేశ్ వెంకట్రామన్, మిమే గోపి, సునయన, శశాంక్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి గోపీ సుందర్ సంగీతం అందిస్తున్నాడు. మహర్షి కొండ్ల సమర్పణలో మహేంద్ర నాథ్ కొండ్ల నిర్మిస్తున్న ఈ చిత్రంలో బేబి కృతిక, రాజశ్రీ నాయర్, భద్రమ్, ఫణి, కృష్ణ తేజ, ప్రభు, అర్చన అనంత్, కేశవ్ దీపక్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.



# ఎగ్ ఫ్రీజింగ్ చేయించా

## నటి మెహ్రీన్ వెల్లడి

ఇటీవల హీరోయిన్ మృణాల్ ఠాకూర్ చేసిన కామెంట్స్ ఫిల్మ్ వర్గాల్లో హాట్ టాపిక్ అయిన సంగతి తెలిసిందే. ప్రస్తుత రోజుల్లో సరైన రిలేషన్ షిప్ దొరకడం చాలా కష్టమని.. అందుకే తాను ఎగ్ ఫ్రీజింగ్ గురించి ఆలోచిస్తున్నట్లు చెప్పుకొచ్చింది. దీంతో అసలు ఎగ్ ఫ్రీజింగ్ అంటే ఏంటీ ? అనే సందేహాలు వ్యక్తమయ్యాయి. ఎగ్ ఫ్రీజింగ్ అంటే వయసులో ఉన్నప్పుడే ఆరోగ్యకరమైన అండాల్ని భద్రపరచుకోవడం. కావాల్సినప్పుడు పిల్లలను కనే వెసులుబాటు కల్పిస్తోన్న ఈ సంతాన పద్ధతిని చాలా మంది హీరోయిన్స్ పాటిస్తున్నారు. ఇప్పటికే చాలా మంది హీరోయిన్స్ ఈ ఎగ్ ఫ్రీజింగ్ చేయించుకోగా.. ఇప్పుడు హీరోయిన్ మెహ్రీన్ కూడా ఆ జాబితాలో చేరారు. తాను ఎగ్ ఫ్రీజింగ్ చేయించుకున్నానని.. గత రెండేళ్లుగా దీనికోసం ప్రయత్నిస్తున్నట్లు ఓ వీడియోను షేర్ చేస్తూ అసలు విషయం బయటపెట్టింది. 'ఇది నా వ్యక్తిగత విషయం.. కానీ అందరితో పంచుకోవాలా ?వద్దా? అని చాలాసార్లు ఆలోచించాను. కానీ నాలాంటి చాలా మంది మహిళలు ఈ ప్రపంచంలో ఉన్నారు. ఎప్పుడు పెళ్లి చేసుకోవాలి ?ఎప్పుడు పిల్లలను కనాలి ? అని ఇంకా నిర్ణయించుకోలేకపోతున్నారు. భవిష్యత్తు కోసం ఇది చాలా ముఖ్యం అని నేను భావించాను. దీని గురించి ఎవరు ఎక్కువగా మాట్లాడడం లేదు. కానీ ఇప్పుడు మారుతున్న టెక్నాలజీ సాయంతో మన కోసం మనం మంచి నిర్ణయాలు తీసుకోగలుగుతున్నాం. తల్లి కావాలనేది నా కల. కానీ అందుకు కొన్ని సంవత్సరాలు ఆలస్యం కావచ్చు. అందుకే ఈ ఎగ్ ఫ్రీజింగ్. ఆసుపత్రులంటే భయం ఉన్న నాలాంటి వారికి ఇది పెద్ద సవాలుగా మారింది. ఎందుకంటే హార్మోన్ల ఇంజక్షన్స్ కారణంగా నేను ఆసుపత్రికి వెళ్లిన ప్రతిసారీ కళ్లు తిరిగి పడిపోయాను. ఇది విలువైదేనా అని అడిగితే కచ్చితంగా అవును అని చెబుతాను. మీరు ఏ పని చేసినా మీకోసమే చేయండి.. ఇందుకు ఎప్పుడూ నా పక్కనే ఉన్న నా గైనకాలజిస్ట్ డాక్టర్ రిమ్మి.. మా అమ్మకు ధన్యవాదాలు' అంటూ మెహ్రీన్ రాసుకొచ్చారు. ప్రస్తుతం మెహ్రీన్ షేర్ చేసిన వీడియో నెట్టింట వైరలవుతుంది.



# చకచకా తండేల్ షూటింగ్



టాలీవుడ్ యాక్టర్ అక్కినేని నాగచైతన్య నటిస్తోన్న చిత్రం తండేల్ చందూ మొండేటి దర్శకత్వం వహిస్తున్నాడు. రొమాంటిక్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో కోలీవుడ్ భామ సాయిపల్లవి ఫీ మేల్ లీడ్ రోల్‌లో పోషిస్తోంది. తండేల్ డిజిటల్ స్ట్రీమింగ్ రైట్స్‌కు సంబంధించిన వార్త ఇప్పటికే అక్కినేని అభిమానులను ఖుషీ చేస్తోంది.తండేల్ రైట్స్‌ను పాపులర్ ఓటీటీ ఎ÷–లాట్‌ఫాం నెట్‌ప్లిక్స్ దక్కించుకోగా.. తండేలా స్ట్రీమింగ్ రైట్స్‌ను నెట్‌ప్లిక్స్ రూ.40 కోట్లకు సొంతం చేసుకుంది. షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమాకు సంబంధించిన వర్కింగ్ స్టిల్ ఒకటి బయటకు వచ్చింది. చైతూ, సందీప్ వేద్, జబర్దస్త్ మహేశ్, చందూ మొండేటి అండ్ టీం షూటింగ్ లొకేషన్‌లో తీసిన స్టిల్‌ను షేర్ చేయగా.. నెట్టింట వైరల్ అవుతోంది. తండేల్ నుంచి లాంఛ్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌లో చైతూ మత్స్యకారుడిగా మాస్ లుక్‌లో కనిపిస్తూ సినిమాపై అంచనాలు పెంచేస్తున్నాడు. తండేల్‌లో సాయిపల్లవి పోషిస్తున్న సత్య పాత్ర ఇంట్రడక్షన్ వీడియో ఇప్పటికే నెట్టింట హల్ చల్ చేస్తోంది. ఈ మూవీలో సాయిపల్లవి శ్రీకాకుళం అమ్మాయిగా కనిపించనుంది. తండేల్ డిసెంబర్ 20న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. ఈ చిత్రంలో చైతూ అనుకోకుండా పాకిస్థాన్ పాక్ ప్రాదేశిక జలాల వెంబడి అరెస్టైన మత్స్యకారుడి పాత్రలో కనిపించబోతున్నట్టు ఇన్‌సైడ్ టాక్.

# లవ్ డ్రామా సినిమాలంటే ఇష్టం

నటి మాళవికా మోహన్ మలయాళ బ్యూటీ మాళవిక మోహనన్ సోషల్ మీడియాలో ఎంత యాక్టివ్‌గా ఉంటారో తెలిసిందే! ప్రస్తుతం ఆమె చేతిలో తమిళంలో 'తంగలాన్', తెలుగులో 'రాజా సాబ్', హిందీలో 'యుద్ర' చిత్రాలున్నాయి. అయితే ఈ మూడు చిత్రాలు షూటింగ్‌కు విరామం రావడంతో ఆమె కాస్త చిల్ అవుతున్నారు. ఇటీవల ఫారిన్ ట్రిప్ వేసిన ఆమె ప్రస్తుతం ఇంట్లో ఉంటూ అభిమానులతో నెట్టింట ముచ్చట్లు పెడుతున్నారు. 'ఆస్క్ మాళవిక' అంటూ ట్విటర్‌లో క్వశ్చన్ అండ్ ఆన్సర్ సెషన్ నిర్వహించారు. ఆమె నటిస్తున్న చిత్రాలు, ఇష్టాయిష్టాల గురించి పలువురు నెటిజన్లు అడగగా, ఓ నెటిజన్ మాత్రం అసహనానికి గురయ్యే ప్రశ్న అడిగాడు. ఇంతకీ అతను అడిగిన ప్రశ్న ఏంటంటే..

'గ్లామర్ షో చేయడం కాకుండా పాత్రకు తగ్గట్లు యాక్ట్ చేయడం ఎప్పుడు మొదలుపెడతారు' అని అడిగాడు. ఆ ప్రశ్నకుఅసహనానికి లోనైన మాళవిక 'నేను చేయను. నీకు ఏమైనా ఇబ్బందా?' అంటూ ఘాటుగా సమాధానం ఇచ్చింది. 'ఫీల్ అవ్వకండి మేడమ్', 'మీరు అలాంటి వారికి ఎందుకు ఆన్సర్ ఇస్తారు' అంటూ మరికొందరు అభిమానులు ఆమెను కూల్ చేశారు. తనకు లవ్ డ్రామా, రొమాంటిక్ కామెడీ, థ్రిల్లర్ జానర్ సినిమాలంటే చాలా ఇష్టమని చెప్పారు. కథానాయికల్లో అనుష్కాశెట్టి, సమంత అంటే చాలా ఇష్టమని, ఫస్ట్ సెలబ్రిటీ క్రష్ హృతిక్ రోషన్ అని తెలిపింది.

# పరిశ్రమలో తగినంత గుర్తింపు రాలేదు



ఒకప్పుడు స్టార్ హీరోయిన్‌గా అగ్ర కథానాయకుల సరసన అలరించారు ఇలియానా. తాజాగా ఆమె ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ తాను నటించిన ఓ బాలీవుడ్ చిత్రం తర్వాత దక్షిణాదిలో అవకాశాలు తగ్గాయన్నారు. '2012లో అనురాగ్ బసు దర్శకత్వంలో తెరకెక్కిన 'బర్ఫీ'లో ప్రధానపాత్ర పోషించాను. అప్పటికే నేను దక్షిణాదిలో ఫుల్ బిజీ. బర్ఫీ కథా చాలా నచ్చింది. అలాంటి చిత్రాల్లో అవకాశాలు అరుదుగా వస్తాయనిపించింది. దాన్ని వదులుకోవడం తెలివి తక్కువతనంగా భావించాను. అందుకే ఓకే చేశా. అనుకున్నట్లుగానే అది ప్రేక్షకాదరణ పొందింది. దీంతో అందరూ నేను దక్షిణాదిని వదిలేసి బాలీవుడ్‌కు మకాం మార్చానని అనుకున్నారు. ఇక సౌత్ ఫిల్మ్స్‌లో నటించనని భావించారు. ఆ అపోహతోనే నాకు అవకాశం ఇచ్చేందుకు దర్శకనిర్మాతలు ఆసక్తి చూపలేదు. బాలీవుడ్‌కు వెళ్లాక నేను సినిమాలు ఎంపిక చేసే విధానంలో మార్పు వచ్చింది. చాలా సెలక్టివ్‌గా వ్యవహరించా. ఏ పని అయినా నిజాయితీగా చేస్తా. నా పాత్రకు వందశాతం న్యాయం చేయడానికి ప్రయత్నిస్తాను. కానీ పరిశ్రమకి వచ్చి ఇన్నేళ్లు అవుతున్నా.. నాకు రావాల్సిన గుర్తింపు రాలేదనిపిస్తుంది. దానికి కారణం కూడా తెలీదు' అని చెప్పారు.తాజాగా ఇలియానా 'దో ఔర్ దో ప్యార్'తో ప్రేక్షకులను పలకరించారు. విద్యాబాలన్, ప్రతిక్ గాంధీలు ఇందులో కీలకపాత్రలు పోషించారు. ఇటీవల విడుదలైన ఈ రొమాంటిక్ కామెడీ డ్రామా బాక్సాఫీస్ వద్ద మంచి టాక్ అందుకుంది. కొన్ని నెలల క్రితం ఆమె ఓ బిడ్డకు జన్మనిచ్చింది. ప్రస్తుతం సినిమాలకు కాస్త గ్యాప్ ఇచ్చి మాతృత్వాన్ని ఆస్వాదిస్తోంది.